76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2016-18

'రాజధాని వార్తలు' దినపత్రిక ప్రారంభ శుభాకాంక్షలు
అమరావతి వెల్ఫేర్ కౌన్సిల్ (ఎ.డబ్ల్యు.సి)
76809 94755, 88861 11881.
FB:amaravathiwelfarecouncil

# రాజధాని వార్తలు

Voice of Voiceless

'రాజధాని వార్తలు' పేపర్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
94406 62699
76809 94755
www.rajadhanivartalu.com

అమరావతి సంపుటి : 1 సంచిక 1 పేజీలు 4 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని వార్తలు' తెలుగు దిన పత్రిక శుక్రవారం 13-7-2018

## ఆశీర్వదించండి..

రాజధాని ప్రాంతం నుంచి మొదటిసారిగా వారపత్రికను ప్రారంభించి ఇక్కడ జరిగే అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు అందిస్తున్న 'రాజధాని వార్తలు'ను నేటినుంచి దినపత్రికగా రూపొందిస్తున్నాం. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభం అయిన పత్రికారంగాన్ని ఎటువంటి ప్రలోభాలకు లోనుకానీకుండా ఆచరణాత్మక జర్నలిజాన్ని అందిస్తామని పునరుద్ఘాటిస్తున్నాము. మేము పుట్టిపెరిగిన ప్రాంతాలు మాకళ్లముందే అభివృద్ధి చెందడం దానితోపాటే వచ్చే కొన్ని మార్పులు చేర్పులు జరగడం, అందుకు తగ్గట్లుగా మమ్ములు మేము మార్చుకునేట్లు పత్రికా పరంగా కృషి చేస్తున్నామని చెప్పడానికి సంతోషిస్తున్నాము. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తూ.. ఎల్లప్పుడూ ప్రజలకు అవగాహన కలిగిస్తామని మాట ఇస్తున్నాము.. నవ్యాంధ్ర నిర్మాణంలో భాగస్వాములుగా ఎదగటానికి ఇంతకుముందులానే ఇప్పుడు కూడా మీ సహాయ, సహకారాలతో ఆశీర్వదిస్తారని ఆశిస్తూ..

మీ



మొహిసేన ఖాన

# రాష్ట్రంలో భారీ వర్షాలు

**రాజధాని వార్తలు, అమరావతి :** రాష్ట్రంలోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా కోస్తాంధ్రలోని ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటికి తోడు భారీ వర్షాల కారణంగా గోదావరి నది నీటి మట్టం పెరుగుతోంది. దీంతో లంక గ్రామాల ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లాలో పది రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా కోనసీమ ప్రాంతాలు భారీ వర్షాలతో తడిసి ముద్దవుతోంది. కృష్ణా జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నిన్న రాత్రి నుంచి ముసురువానతో వాతావరణంలో ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. ఈదురుగాలులతో పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు వచ్చి చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విజయవాడ నగరంలో అర్ధరాత్రి నుంచి భారీగా వర్షం కురుస్తోంది

కృష్ణా జిల్లా రెడ్డి గూడెం, గన్నవరం, కోటపాడు, వత్సవాయి ప్రాంతాల్లో ఓ మోస్తారు వాన కురిసింది. చాట్రాయి, వీర్లుపాడు, చందర్లపాడు, ఉంగుటూరు, బాపులపాడు, కంచికచర్ల, ఇబ్రహీంపట్నం, పెనుగంచుప్రోలు, నందిగామ ప్రాంతాల్లో చెదురుమొదురు వానలు కురుస్తున్నాయి. జగ్గయ్యపేట, మైలవరం పరిసర ప్రాంతాల్లో అర్ధరాత్రి నుంచి వర్షం కురుస్తూ ఉండటంతో వ్యవసాయ పనులు ఊపందుకుంటున్నాయి. రెడ్డిగూడెం మండలం రంగాపురంలో 71.75 మి.మీ, గన్నవరంలో 71.50 మి.మీ, కోటపాడు 54.25 మి.మీ, అల్లూరులో 50.50మి.మీ, వత్సవాయలో 50.25 మి.మీ, చందర్లపాడులో 50మి.మీ వర్షం నమోదు అయ్యింది. పశ్చిమగోదావరి జిల్లాలోనూ వర్షాలు కురుస్తున్నాయి. వారంరోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజాజీవనానికి ఆటంకం కలుగుతోంది. జిల్లాలోని తణుకు, అత్తిలి, ఇరగవరం, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండల ప్రాంతాల్లో ఎడతెరపిలేని వర్షం కురుస్తోంది. దీంతో పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు వచ్చి చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అత్తిలి, ఉండ్రాజవరం, తణుకు, ఇరగవరం మండలాల్లో పంటలు నీట మునిగాయి. భారీ వర్షాలతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇక పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి వరద అంతకంతకూ పెరుగుతోంది. వరద ఉధృతి మరింత పెరిగితే స్పిల్‌వే పనులు నిలిచే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వరద నీరు అధికంగా ఉండటంతో వారం క్రితమే కాఫర్ డ్యామ్ పనులు నిలిచిపోయాయి. కోనసీమలో ఖరీఫ్ నారుమళ్లకు తీవ్రమైన నష్టం ఏర్పడింది. ముంపునీరు దిగక



నారుమళ్లు కుళ్లిపోతున్నాయి. నారుమడుల్లో నుంచి ముంపు నీటిని బయటకు పంపేందుకు రైతులు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. మరోవైపు లోతట్టు ప్రాంతాలు కాకుండా మాగానిలో మెరకప్రాంత ఆయకట్టులో ఖరీఫ్ నాట్లు పడుతున్నాయి. వర్షాల కారణంగా ఈ పనులు వేగంగా ముందుకు సాగడం లేదు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ 20 రోజుల పైబడి వృధా అయిపోయింది. ఈ ప్రభావం పంట చేతికొచ్చే సమయంపై పడుతుందని రైతులు కలవరపాటుకు గురవుతున్నారు.

- మిగతా 2 లో

# ఫైనల్స్‌కు చేరిన క్రొయేషియా

**సంబరాల్లో ప్రజలు**



**హైదరాబాద్ :** రష్యాలో జరుగుతున్న ఫిఫా వరల్డ్ కప్‌లో గురువారం లుజ్నికీ స్టేడియంలో జరిగిన రెండో సెమీఫైనల్లో ఇంగ్లాండ్‌పై 2-1 తేడాతో గెలిచి తొలిసారిగా ఫైనల్‌కు చేరింది. దీంతో వరల్డ్ కప్ ఫైనల్లో తలపడే రెండు జట్లు ఏవో తెలిసిపోయింది. బెల్జియంతో జరిగిన తొలి సెమీఫైనల్లో ఫ్రాన్స్ విజయం సాధించగా, ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో సెమీఫైనల్లో క్రొయేషియా విజయం సాధించి మాస్కోలోని లుజ్నికి స్టేడియంలో వరల్డ్ కప్ ఫైనల్ పోరుకు సిద్ధమయ్యాయి. 1998 వరల్డ్ కప్‌లో సెమీఫైనల్ చేరుకోవడమే క్రొయేషియా జట్టు

అత్యుత్తమ ప్రదర్శన కావడం విశేషం. దీంతో ఫిఫా వరల్డ్‌కప్ ఫైనల్ చేరిన చిన్నదేశంగా (జనాభా పరంగా) క్రొయేషియా నిలిచింది.

క్రొయేషియా జనాభా సుమారు నలభై లక్షలు. అంటే మన దేశంలో మిజోరం-నాగాలాండ్ ఈ రెండు రాష్ట్రాలను కలిపితే ఉన్న జనాభా కంటే క్రొయేషియా దేశ జనాభానే తక్కువ. ఒక్క హిమాచల్ ప్రదేశ్(68.6లక్షలు) రాష్ట్రంతో పోల్చి చూసినా క్రొయేషియా జనాభా తక్కువే. దీంతో 1950లో వరల్డ్‌కప్ ఫైనల్ చేరిన చిన్న దేశంగా ఉరుగ్వే చరిత్ర సృష్టించింది.

**68 ఏళ్ల తర్వాత ఫైనల్‌కు చేరిన చిన్న దేశం**

ఆ తర్వాత అంటే 68 ఏళ్ల తర్వాత 2018 ఫిఫా వరల్డ్‌కప్

- మిగతా 2 లో



వర్షాలకు సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణ గుంతల్లో నీళ్లు



చిన్నపాటివర్షానికే నీటమునిగిన రాయపూడి ఎస్సీకాలనీ

## ఆస్ట్రేలియాలో 6వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు

**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** మూడు దేశాలలో తెలుగు భాషా సాహిత్యాల పురోగతికి విశేష కృషి చేస్తోన్న సాహితీ సంస్థలు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ నగరంలో నవంబరు 3,4 తేదీలలో 6వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సును నిర్వహిస్తున్నాయి. ఆస్ట్రేలియా తెలుగు సంఘం, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా(హ్యూస్టన్, హైదరాబాద్), లోక్ నాయక్ ఫౌండేషన్ (విశాఖపట్నం).. ఈ మూడింటితో పాటు ఆస్ట్రేలియా తెలుగు సమాఖ్య, సింగపూర్, హాంగ్‌కాంగ్, ఇండోనేషియా థాయ్‌ల్యాండ్ తదితర దేశాల్లోని తెలుగు సంస్థలు ఈ సదస్సుకు సహకారాన్ని అందిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'తెలుగు సాహిత్యంలో హాస్యం-ఆ నాడూ - ఈ నాడూ' అనేది సదస్సులో ప్రధానాంశంగా ఉంటుందన్నారు. ఇతర వివరాలకు సదస్సు సంచాలకులు శ్రీని కట్టాను ఫోన్ నంబరు: 61 413 398 940లో సంప్రదించవచ్చన్నారు.

## తొలిస్థానంలో మనమే : చంద్రబాబు

రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి : 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మొదటిస్థానంలో ఉన్నామని, శాశ్వతంగా మనమే తొలిస్థానంలో ఉంటామని' ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వేతనాలు పెంచినందుకు చంద్రబాబును అంగన్‌వాడీ, ఆశావర్కర్లు గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు సంఘటితం కావాలని అన్నారు. శాశ్వత అంగన్‌వాడీ భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లకు చంద్రన్నబీమా వర్తింపజేస్తామని సీఎం ప్రకటించారు. ఆగస్టు 15లోపు అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు సెల్‌ఫోన్లు ఇస్తామన్నారు. కేంద్రం సహకరించకపోయినా నిలదొక్కుకునే శక్తి వచ్చిందంటే కారణం ప్రజల సహకారమే అని సీఎం వెల్లడించారు.

**అంగన్వాడీలకు చంద్రబాబు వరాలు**

అంగన్వాడీల అవగాహన సదస్సులో గురువారం సీఎం చంద్రబాబు పాల్గొని మాట్లాడుతూ తల్లీబిడ్డల్లో పోషకాహార లోపం, రక్తహీనత నివారించేందు అంగన్వాడీలు కృషి చేయాలన్నారు. ఆగస్టు 15 నాటికి అంగన్వాడి టీచర్లందరికీ సెల్ ఫోన్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఐసీడీఎస్ రికార్డులన్నీ సీఎఎస్ ఆప్ ద్వారా ఆన్ లైన్ లోనే నమోదు చేసుకునే వెసులుబాటు కల్పిస్తామన్నారు. ప్రభుత్వ




పథకాలు, కార్యక్రమాల పై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో 60 రోజుల్లో టాయిలెట్స్, 45 రోజుల్లో తాగునీరు, నెలరోజుల్లో విద్యుత్ సదుపాయాలు కల్పిస్తామన్నారు. అంగన్వాడీలకు తెల్లరేషన్ కార్డు, చంద్రన్న బీమా వంటి ప్రభుత్వ పథకాలు అమలవుతాయని భరోసా ఇచ్చారు. త్వరలో కార్పొరేట్ సంస్థలతో సమావేశం పెట్టి అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు వారి సహాయం కోరతామన్నారు.

## విరుచుకుపడ్డ పోలీసు లాఠీలు



**రాజధానివార్తలు గుంటూరు :** అక్రమంగా అరెస్టు చేసిన ముస్లీం యువకులను వెంటనే విడుదల చేయాలని, వారిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ.. సీపీఎం, సీపీఐల ఆధ్వర్యం లో గురువారం ధర్నా నిర్వహిం చారు. అక్రమంగా అరెస్టయిన బాధితుల కుటుంబాలను పరామర్శించడానికి బయలుదేరిన సీపీఎం కార్యకర్తలపై పోలీసులు లాఠీలతో విరుచుకుపడ్డారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య, సీపీఐ నాయకులు ఓబులేసు, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావులను అరెస్టు చేసి నల్లపాడు పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## విట్ అధ్యాపకులకు 3 రోజుల శిక్షణ

**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** విట్ -ఏపీ, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థతో కలిసి ఇంజనీరింగ్ అధ్యాపకులకు మూడురోజుల శిక్షణా కార్యక్రమాలను చేపట్టారు. విద్యార్థులను పరిశ్రమల అవసరానికి అనుగుణంగా తీర్చిదిద్దటమే తమ లక్ష్యమని విట్ ఇంజనీరింగ్ సంస్థ స్పష్టం చేసింది. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన అధ్యాపకులకు బోధన, అభ్యాసంలో సమగ్రమైన శిక్షణ అందిస్తున్నామని ఐయూసీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ వేదుల చెప్పారు. విఐటీ-ఏపీ యూనివర్సిటీలో ఇప్పటికే ఇండస్ట్రీ ఒరియేంట్ పోగ్రాములు ఏర్పాటు చేశామని, మెంటార్ ద్వారా విద్యార్థులను చైతన్యపరచటం, ఇంజనీరింగ్ క్లీనిక్స్ ద్వారా వారిలో నైపుణ్యాలను పెంచేలా కోర్సులు రూపొందించి, వీటి ద్వారా దేశ భవిష్యత్తు తీర్చిదిద్దుకోవచ్చని విఐటీ-ఏపీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సివిల్వీ శివకుమార్ అన్నారు. ఇంజనీరింగ్ విద్య బోధనలో ఉన్నత ప్రమాణాలు పెంచేందుకు ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఇండో యూనివర్సల్ కొలాబరేషన్ ఫర్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ సంస్థ కృషి చేస్తోందని ఐయూసీసీ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్



సోహం సోహోని వెల్లడించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణా తరగతులు విఐటీ- ఏపీ యూనివర్సిటీలో జరుగుతాయని, రాబోయే రోజుల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తో కలిసి మరిన్ని శిక్షణా తరగతులు చేపట్టనున్నామని డాక్టర్ సివిల్వీ శివకుమార్ తెలిపారు.

'రాజధాని వార్తలు' దినపత్రిక ప్రారంభ శుభాకాంక్షలు




## హజ్ యాత్రీకులకు వాక్సినేషన్ క్యాంపులు

**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** హజ్ యాత్రకులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా రాష్ట్ర హజ్ కమిటీ జిల్లాల వారీగా వ్యాక్సినేషన్ క్యాంప్‌లను ఏర్పాటు చేసింది. విజయవాడ, ఒంగోలు, కర్నూల్, ఆత్మకూర్, నంద్యాల, విశాఖపట్నంలలో ప్రత్యేక హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి హజ్ యాత్రికులకు వ్యాక్సిన్ ఇచ్చారు. గురువారం రాజమండ్రి, గుంటూరు పట్టణాల్లో వ్యాక్సిన్ క్యాంప్ ఏర్పాటు చేసి హజ్ యాత్రికులకు టీకాలు వేశారు. గుంటూరు హజ్ వ్యాక్సినేషన్ క్యాంప్ ను ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ ఎంఏ షరీఫ్ లాంఛనంగా ప్రారంభించారు. సౌదీ ప్రభుత్వ సూచన మేరకు ఈ చర్యలు చేపట్టామని ఆయన వెల్లడిచారు. లగేజీకి సంబంధించి 22 కేజీల రెండు సూట్‌కేసులు, హ్యాడ్ బ్యాగ్ 10 కేజీలకు అనుమతిస్తారన్నారు. విమానాల షెడ్యూల్ వచ్చిన తరువాత తమకు కేటాయించిన తేదీకి 24 గంటల ముందు హైదరాబాద్ లోని నాంపల్లి హజ్ హౌస్‌కు చేరుకోవాలన్నారు. ప్రతి హజ్ యాత్రికుడు పేపర్ వీసా మీద వున్న వివరాలు, పాస్ పోర్ట్ లో వున్న వివరాలతో సరిపోల్చుకొని చూసుకోవాలని ఎమ్మెల్సీ షరీఫ్ హజ్ యాత్రికులకు విజ్ఞప్తి చేశారు.




ప్రతి హజ్ యాత్రికుడు వ్యాక్సిన్ తీసుకోవడం, శిక్షణా తరగతుల్లో సూచించిన సలహాల మేరకు హజ్ విధి విధానాల్ని పాటించడంతోపాటు తమకు తెలియని విషయాల్ని తెలుసుకోవాలన్నారు. సమావేశంలో హజ్ కమిటీ ఛైర్మన్ మోమిన్ అహ్మద్ హుస్సేన్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ హిదాయత్, గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్మన్ జానీమూన్, ఏపీ హజ్ కమిటీ సభ్యులు హాజీ హసన్ భాషా, జడ్పీటిసి సభ్యులు షరీఫ్, పలువురు టీడీపీ సీనియం నాయకులు పాల్గొన్నారు.

15న ముస్లిం హక్కుల పోరాటసమితి సమావేశం ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం జూలై 15 ఆదివారం గుంటూరులో జరగనుందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలీ తెలిపారు.

## సైబరాబాదుకు పరిపూర్ణానంద

**అలర్ట్ అయిన పోలీసులు**



**హైదరాబాదు :** స్వామి పరిపూర్ణానందను 6 నెలల పాటు హైదరాబాద్ నుంచి బహిష్కరించగా, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లు కూడా ఆయనపై బహిష్కరణ విధించాయి. అయితే గురువారం మళ్లీ సైబరాబాద్‌కు వచ్చేందుకు పరిపూర్ణానంద ప్రయత్నించారు. రాజమహేంద్రవరం మధురపూడి విమానాశ్రయం నుంచి హైదరాబాదుకు ఆయన టికెట్ బుక్ చేసుకున్నారు. తన బహిష్కరణ కేవలం హైదరాబాదు వరకే పరిమితం కావడంతో... సైబరాబాద్ పరిధిలో ఉండేందుకు ఆయన వస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లు కూడా అప్రమత్తమై ఆయనను నిషేధించాయి.



# ప్రమాదంలో రూపాయి

→ బ్యాంకర్లు, నిపుణుల అంచనా..
→ బలపడుతున్న డాలర్ కరెంట్ అకౌంట్ లోటు
→ క్రూడాయిల్ ధర పెరుగుదల
→ ప్రమాద ఘంటికలు




**ముంబై :** డాలర్‌తో రూపాయి మారకం విలువ ఈ వారం రూ.70 దాటిపోతుందా? అవుననే అంటున్నారు. బ్యాంకర్లు, కరెన్సీ మార్కెట్ విశ్లేషకులు. ఈ వారంలో డాలర్‌తో మారకం రూ.69.30 దాటితే ఒక ఏకంగా రూ.70 అధిగమించడం ఖాయంగా కనిపిస్తున్నదని బ్యాంకర్లు అభిప్రాయ పడుతున్నారు. అంతర్జాతీయంగా బలపడుతున్న డాలర్ విలువ, తగ్గిన విదేశీ పెట్టుబడుల రాకడ, చమురు ధరల పెరుగుదల కారణాలతో రూపాయి మారకం విలువపై మరింత ఒత్తిడి పెరిగే అవకాశాలున్నాయి. ఒకవేళ రూ.70 స్థాయిని అధిగమిస్తే మరింత పెరగకుండా రిజర్వ్‌బ్యాంకు ప్రయత్నాలను ముమ్మరం చేసే అవకాశం ఉంది. రూ.70 స్థాయినే అధిగమించే పరిస్థితులే ఏర్పడితే రిజర్వ్‌బ్యాంకుకు కాస్త ఇబ్బందికర పరిస్థితులే ఏర్పడవచ్చు. అధిక క్రూడాయిల్ ధరల కారణంగా పెరిగిన కరెంట్ అకౌంట్ లోటు, చమురు కంపెనీలతో పాటు దిగుమతిదారుల నుంచి డాలర్‌కు పెరుగుతున్న డిమాండ్‌తో రూపాయి మరింత బలహీన పడే అవకాశం ఉంది. ఈ వారంలో డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.70 పైన నిలదొక్కుకోవడం అంత సులువు కాదు అని సీనియర్ బ్యాంకింగ్ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. విదేశీ వాణిజ్య రుణాలు (ఈసీబీ) తీసుకున్న కంపెనీలు డాలర్లలో రుణాలను డాలర్లలో చెల్లించాల్సి ఉన్నందున డాలర్లను దాచుకుంటున్నాయని ప్రముఖ బ్యాంక్ ట్రెజరల్ ఒకరు తెలిపారు. రూపాయి మారకం విలువపై రిజర్వ్‌బ్యాంక్ ఎలాంటి లక్ష్యాలను ప్రకటించకపోయినప్పటికీ ఒడిదుడుకులను అరికట్టేందుకు డాలర్లను విక్రయిస్తుంది. జూన్ 29 నాటికి విదేశీ కరెన్సీ రిజర్వులు 406.058 బిలియన్ డాలర్ల మేర ఉన్నాయి. దీంతో కరెన్సీ మరింత పతనం కాకుండా ఉండేందుకు రిజర్వ్ బ్యాంక్ శతవిధాల ప్రయత్నిస్తుందని కరెన్సీ మార్కెట్ విశ్లేషకుడు ఒకరు వ్యాఖ్యానించారు. అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధంతో ఆసియా దేశాల కరెన్సీలు నష్టపోతున్నాయి. ఆసియా కరెన్సీల్లో రూపాయి విలువనే గరిష్ఠంగా నష్టపోయిందిజ వాణిజ్య సుంకాల పోరులో దేశీయ మార్కెట్‌లోకి వచ్చే విదేశీ పోర్టుఫోలియో పెట్టుబడులు కూడా బాగా తగ్గిపోయాయనీ, గత నెలలో పోర్టుఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ కూడా ఎక్కువగా జరిగిందని బ్యాంకర్ ఒకరు తెలిపారు. రిజర్వ్‌బ్యాంక్ పాలసీ రేట్లను పెంచినప్పుడల్లా రూపాయి విలువ పతనం అవుతుందని బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిల్‌లించ్ విశ్లేషించింది. గత నెలలో జరిగిన పరపతి విధాన సమిక్షలో రెపోరేటును పెంచినప్పటి నుంచి రూపాయి మారకం విలువ 1.8 శాతం మేర నష్టపోయింది. కాగా, గత నెల రోజుల్లో 200 కోట్ల డాలర్ల విదేశీ పోర్టుఫోలియో పెట్టుబడులు తరలి వెళ్లాయని మెరిల్‌లించ్ తన నివేదికలో వెల్లడించింది. ఒక వేళ డిసెంబర్ వరకూ విదేశీ పోర్టుఫోలియో పెట్టుబడుల నికరంగా తరలివెళ్లే పరిస్థితులు ఏర్పడితే రూపాయి మారకం విలువ రూ.70ని డాటడం ఖాయమని అభిప్రాయ పడింది. ఇలాంటి పరిస్థితుల్లో రిజర్వ్ బ్యాంక్ 30-35 బిలియన్ డాలర్ల సమికరణకు ప్రవాస భారతీయుల బాండ్లను ప్రవేశపెట్టవచ్చునని తెలిపింది. డిసెంబర్ త్రైమాసికంలో కూడా ఎఫ్‌పీఐ పెట్టుబడులు తిరిగి రాకపోతే ఎన్ఆర్ఐ బాండ్ల ద్వారా వచ్చే విదేశీ కరెన్సీ డిపాజిట్లు కరెన్సీ మార్కెట్‌లో కాస్త వెసులుబాటు కల్పించవచ్చునని మెరిల్‌లించ్ తెలిపింది. విదేశీ పోర్టుఫోలియో పెట్టుబడుల తరలివెళ్లడం వల్ల రిజర్వ్ బ్యాంక్ దాదాపు 20 బిలియన్ డాలర్లను విక్రయించవచ్చుననీ, అలాగే ఓపెన్ మార్కెట్ కార్యకలాపాల ద్వారా మరో 50 బిలియన్ డాలర్లను అమ్మే అవకాశం ఉందని మెరిల్‌లించ్ అంచనా వేసింది. 2019 ఎన్నికల క్రమంలో పెరుగుతున్న రాజకీయ అనిశ్చిత పరిస్థితులు, రిజర్వ్‌బ్యాంకు స్పష్టమైన విధానాలను ప్రకటించలేకపోవడం వంటి అంశాలు రూపాయి మారకం విలువపై ప్రభావం చూపిస్తాయని బార్‌క్లేస్ అభిప్రాయ పడింది.

## రాజధాని వార్తలు కలం

# మనుష్యులే ముఖ్యం

మతాలు ముఖ్యం కాదు.. మనుష్యులే ముఖ్యం. ఎప్పుడో జరిగిన,లేదా జరిగాయనుకున్న పురాణ ఇతిహాసాలపై వాదనలు అనవసరం. ఎన్నో జీవపరిణామాలతోపాటు అత్యున్నత సాంకేతిక ప్రగతిని సాధించిన మనం రామాయణ, మహాభారతాలపై వాదులాడుకోవడం కాలయాపన మాత్రమే. రామాయణాన్ని ఎంతమంది పూర్తిగా చదివారో కాని, దానిలోని నిజానిజాలను తెలుసుకున్న వాళ్లను చేతివేళ్లపై లెక్కపెట్టవచ్చు. వాస్తవానికి రామాయణ,మహాభారతాలపై విమర్శలు కొత్తగా రావడం లేదు. అవి వస్తూ..పోతూ ఉంటాయి.. 'అగ్నిప్రవేశం' అనే పుస్తకంలో రాముడు శీల పరీక్షకోసం సీతను అగ్ని ప్రవేశం చేయించడాన్ని స్త్రీవాద రచయిత చలం తీవ్రంగా విమర్శించాడు. సుప్రసిద్ధ న్యాయవాది, బీజేపీనేత రాంజెత్మలాని రాముడు అత్యంత చెడ్డ భర్తని బహిరంగంగా ప్రకటించాడు.


రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన శ్రీపాద సుబ్రమణ్య శాస్త్రి పరువు ప్రతిష్టల కోసమే రావణుడిని ఓడించాను కాని, నీపై ప్రేమతో కాదన్నాడని, అలా సీత అత్యంత దారుణంగా అవమానానికి గురైనట్లు తన పుస్తకంలో రాశారు. 'చంద్రవతీ రామాయణం'లో రాముడికి జాలి, కరుణ లేవని బెంగాలీ రచయిత్రి రాసింది. ఉత్తరరామాయణంలో 'శంభూక వధ'పై త్రిపురనేని రామస్వామి రాస్తూ రాముడిని క్రూరుడుగా చిత్రీకరించాడు. రామాయణం పై రమణమహర్షి స్పందిస్తూ కేవలం 30 శాతం మాత్రమే నిజమని,మరో 70 శాతం కల్పితమన్నాడు.. ఆరుద్ర రాసిన పుస్తకం 'రాముడికి సీత ఏమవుతుంది' అని వారిద్దరి జన్మవృత్తాంతాలపై కూలంకుషంగా చర్చించారు. ముప్పాళ్ల రంగనాయకమ్మ 'రామాయణ విషవృక్షం'లో రాముడి తీరును ఏకిపారేశారు. అన్ని దుర్లక్షణాలు ఉన్న రాముడిని మంచివాడిగా, శివభక్తుడు,పరిపాలనా దక్షుడు, ఆడిన మాట తప్పనివాడు, తనను నమ్మి వచ్చిన వారికి ప్రాణాలైనా ఇచ్చేవాడు రావణుడిని రాక్షసుడిలా వివరించడం జరిగిందని రంగనాయకమ్మ టీవీ 10 ఇంటర్వ్యూలో చెప్పకనే చెప్పారు.

రాముడిది ఒకే మాట.. ఒకే బాణం.. ఒకే భార్య అని భక్తకోటి రాముడిని వేనోళ్ల కీర్తిస్తూనే ఉన్నారు. 'రామాయణ రహస్యాలు' పుస్తకంలో రాముడికి 129 మంది భార్యలు ఉన్నారని, అతనికి సురాపానం, మాంసం తినే అలవాటు ఉందని, సంస్కృతాంధ్ర భాషల ప్రవీణుడు కొత్త సత్య నారాయణచౌదురి వివరించారు. రామాయణం రాసిన వాల్మీకి రాముడు చాకలివాడి ఆరోపణతో సీతను విడిచి పెట్టాడని ఎక్కడా లేదని తేల్చారు. ఆ కథ 11శతాబ్దంలో సోమదేవుడు రాసిన 'కథా సరిత్సాగరం లోనిదని, వాల్మీకి రామాయణం యుద్ధకాండ 113,114 సర్గాల ప్రకారం రావణుడి వధ తర్వాత కూడా సీతను చూడటంలో రాముడు ఏమాత్రం ఆసక్తి కనపరచలేదు. సరికదా సీత తానే వస్తానన్నా.. కుంటి కారణాలు చెప్పినట్లు వివరించారు.. చిట్టచివరికి సీత పల్లకీలో వస్తుండగా, శీలం పోయాక గౌరవం ఎందుకు పల్లకి దిగి లక్షలాది మంది ముందు నడుచుకుంటూ రా అని సీతను రాముడు అవమానించినట్లు ప్రకటించారు.

ఎవరెన్ని విమర్శలు చేసినా రామాయణాన్ని , రామనామాన్ని భక్తిప్రపత్తులతో కొలిచే వారి సంఖ్య తరగలేదుకదా.. అలాంటప్పుడు లేనిపోని వాదాలెందుకు ? అన్నింటికంటే ముఖ్యమైనది, గుర్తుంచుకోవాల్సింది ఏమంటే ప్రపంచంలోని ఏ మత గ్రంథం తార్కికానికి నిలబడలేదు. ఏగ్రంథం నుంచైనా మంచిని మాత్రమే తీసుకోవాలి. ప్రపంచ పౌరుల నడుమ సుహృద్భావం పరిఢమించాలిగాని, మతాలు కాదు ముఖ్యం.. మనిషే ముఖ్యం.. అని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

అసతోమా సద్గమయ,
తమసోమా జ్యోతీర్గమయ,
మృత్యోర్మ అమృతంగమయ

అశాంతి, అసత్యంలోనుంచి సత్యంలో బ్రతికే అవకాశం, కార్పణ్యాల చీకటి నుంచి వెలుగులోకి, మృత్యువు నుంచి ప్రేమాభిమానాలనే జీవంలోకి దేశ ప్రజలు నడవాలని ఆకాంక్షిద్దాం.




# గెలిస్తే తండ్రుల ఖ్యాతి.. ఓడితే కొడుకుల అపఖ్యాతి!



**రాజధాని ప్రతినిధి,అమరావతి :** తెలుగురాష్ట్రాల్లో సీనియర్ నేతలంతా వృద్ధాప్యానికి వచ్చేశారు. వారిలో ఇద్దరు చంద్రులూ ఉండటం కూడా విశేషమే. అబ్బే. వారిని 2024 వరకూ వదిలేస్తే.. కొడుకుల రాజకీయ వారసత్వం అందవచ్చు.. అందక పోనూ వచ్చు అందుకే ఇప్పటికిప్పుడే వారసత్వం కట్టబెట్టాలనేందుకు మూల కారణం. కేటీఆర్, లోకేష్ ఇద్దరూ విదేశాల్లో మంచి చదువులు చదివారు. కొలువులు చేపట్టారు. ఆ తరువాత రాజకీయ ఓనమాలతో కేటీఆర్ ప్రజాక్షేత్రంలో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయ్యారు. లోకేష్ మాత్రం ఎమ్మెల్సీ పదవితో అమాత్యపదవి దక్కించుకున్నారు. కేటీఆర్ అంతటి పరిణితి, మాటకారి తనం లోకేష్‌కు ఇంకా అలవడలేదు. పవన్‌కళ్యాణ్ వంటి నాయకుడు తమతో కలసి ఉండాలనే ఆలోచనతో లోకేష్ ఆచితూచి విమర్శలు చేయటం కూడా ఇక్కడ ప్రస్తావనార్హం.2019లో తండ్రుల వారసత్వాన్ని ఎలా నిలబెడతారనేది వారసులకు పెనుసవాల్ విసురుతోంది. ఈ జాబితాలో జగన్ మోహన్‌రెడ్డి కూడా వున్నా.. ప్రస్తుతం పవర్‌లో ఉన్న నేతలు కావటమే వీరిపై మరింత అంచనాలు పెరగటానికి కారణం. కానీ.. చంద్రులతో పోల్సితే.. వీరిద్దరి రాజకీయ అనభవం చాలా స్వల్పం. బావోద్వేగాలను అదుపులో ఉంచుకుని ఆచితూచి స్పందించటం కూడా వారసులకు అబ్బలేదు. వెన్నుపోటు పొడిచే వారి గురించి వీరికి తెలియదనే చెప్పాలి. ఇక.. అభిమానులను ఓటుబ్యాంకుగా మలచుకోవటం. పోలింగ్ బూత్ వరకూ తీసుకురావటం.. అక్కడ బ్యాలెట్ వరకూ తమను గుర్తుంచుకునేలా ప్రజల మనసులో నాటుకోవటం అనుకున్నంత ఈజీకాదు.. కానీ.. ఒక్కటి మాత్రం నిజం.. ఒకవేళ వారసులిద్దరూ సక్సెస్ అయితే.. తండ్రులకే ఖ్యాతి దక్కుతుంది. అదే.. ఒకవేళ అటుఇటైతే.. కొడుకులకే అపఖ్యాతి మూటగట్టుకోవాల్సి వస్తుంది. ఎందుకంటే.. వీరు తండ్రులకు తగిన తనయులు కాదనేది జనం భావిస్తున్నారని విశ్లేషకులు వెల్లడిస్తారు.

# టీడీపీలోకి మరో మాజీ మంత్రి




**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** కొండ్రు మురళీ మోహన్.. శ్రీకాకుళం జిల్లాలో కీలక నేత. కాంగ్రెస్ హయాంలోని కిరణ్ కుమార్ రెడ్డి కేబినెట్‌లో మంత్రిగా చేసిన ఆయన.. టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారట. రాష్ట్ర విభజన తర్వాత రాజకీయాలకు దూరంగా ఉన్నారు మాజీ మంత్రి కొండ్రు. శ్రీకాకుళం జిల్లా రాజాం నియోజకవర్గానికి చెందిన ఆయనకు మొదట వైసీపీ గాలం వేసింది. అయితే ఆ స్థానంలో వైసీపీకి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే కంబాల జోగులు ఉండడం వల్ల ఆయనకు వేరే స్థానంలో టికెట్ ఇస్తామని చెప్పారని, అందుకు కొండ్రు అంగీకరించలేదని సమాచారం. ఈ విషయం తెలిసిన టీడీపీలోని కొందరు ముఖ్య నేతలు ఆయనను కలిసి చర్చలు జరిపారట. ఈ చర్చలు సఫలం అవడంతో ఆయన టీడీపీలోకి రావడానికి సిద్ధమయ్యారని తెలుస్తోంది. అదే స్థానంలో గతంలో పోటీ చేసిన టీడీపీ సీనియర్ నాయకురాలు ప్రతిభా భారతికి రాజ్యసభ సభ్యత్వమో, ఎమ్మెల్సీనో ఇచ్చి.. కొండ్రుకు రాజాం అసెంబ్లీ టికెట్ ఇప్పించాలని సదరు నేతలు ప్రయత్నాలు ప్రారంభించారట. ఈ విషయం చంద్రబాబు వరకు చేరిందని, ఆయన కొద్దిరోజులు వేచి చూడాలని ఆ నేతలతో చెప్పారని వార్తలు వస్తున్నాయి. సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే కొండ్రు సైకిల్ ఎక్కుతారని జోరుగా ప్రచారం జరుగుతోంది.

# వైసీపీలోకి మాజీ మంత్రి మహీధర్‌రెడ్డి



**పందలపాక (బిక్కవోలు) :** మాజీ మంత్రి, ప్రకాశం జిల్లా కందుకూరు మాజీ ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి బుధవారం వైసీపీలో చేరారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గంలో ప్రజాసంకల్ప యాత్ర నిర్వహిస్తున్న జగన్, పందలపాక గ్రామంలో మహీధర్‌రెడ్డి, ఆయన అనుచరులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ పటిష్ఠతకు చిత్తశుద్ధితో పనిచేస్తానని మహీధర్‌రెడ్డి తెలిపారు. వర్షం కారణంగా మంగళవారం రద్దయిన జగన్‌మోహన్‌రెడ్డి 'ప్రజాసంకల్ప యాత్ర' బుధవారం ఉదయం 8.35 గంటలకు ప్రారంభమైంది. తూర్పుగోదావరి జిల్లా రాయవరం నుంచి అనపర్తి నియోజకవర్గంలోని కొమరిపాలెం గ్రామానికి చేరుకున్న జగన్‌కు ఆ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి స్వాగతం పలికారు. భారీగా హాజరైన ప్రజలకు అభివాదం చేసుకుంటూ.. తొస్సిపూడి సెంటరు మీదుగా జగన్ ముందుకు సాగారు. పందలపాక గ్రామంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) సభ్యులు జగన్‌ను కలిసి తమ డిమాండ్లను వివరించారు. అధికారంలోకి రాగానే కాంట్రిబ్యూటరీ పించను పథకం (సీపీఎస్) విధానాన్ని రద్దు చేస్తామని ప్రకటించినందుకు వారు జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భోజన విరామ సమయానికి పాదయాత్ర ఊలపల్లి గ్రామానికి చేరుకుంది. ఈలోగా వర్షం ప్రారంభం కావడంతో మధ్యాహ్నం పాదయాత్రను నిలిపివేశారు.

# ఎర్రచందనం అక్రమ రవాణాలో సినీనటుడు



**తిరుపతి :** ఎర్రచందనం అక్రమ రవాణాలో తెలుగు సినీ పరిశ్రమకు చెందిన హరి అనే వ్యక్తి పాత్ర ఉందని గురువారం టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. జబర్దస్త్ షోతో పాటు శంభో శంకర సినిమాలో హరి నటించాడు. శంభో శంకర సినిమాకు హరి ఫైనాన్స్ పెట్టాడు. నిందితునిపై 25 కిపైగా కేసులు ఉన్నాయని, త్వరలోనే పూర్తి ఆధారాలతో పట్టుకుంటామని టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు.


# నిరాశతో వెనుదిరిగిన జనం



**రాజధాని వార్తలు ప్రతినిధి,విజయవాడ అర్బన్ :** విజయవాడ గాంధీనగర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ వద్ద గురువారం ఆహారం దొరకక జనం వెనుదిరిగారు. గురువారం అన్న క్యాంటీన్‌లో 400 గ్రాములు పెట్టవలిసిన భోజనాన్ని 200 గ్రాముల చొప్పున పెట్టారు. చాలీచాలని ఆహారం దొరికి నిరాశగా కొంతమంది వెనుదిరిగితే.. మరికొందరికి లైన్‌లో చాలాసేపు నిలుచున్నా .. ఆహారం దొరకక వెనుదిరిగారు.

# తృటిలో తప్పిన ఘోర ప్రమాదం

## ప్రయాణీకులు సురక్షితం



**బెంగళూరు :** నగరంలోని విమానాశ్రయంలో రెండు ఇండిగో విమానాలు ఒకేసారి ఎదురెదురుగా రావడంతో పైలెట్లు చాకచక్యంగా వ్యవహరించి 328మంది ప్రయాణికులను రక్షించారు. 6ఇ 779 కోయంబత్తూరు-హైదరాబాద్, 6ఈ 6505(బెంగళూరు-కొచ్చి విమానాలు సెకన్ల వ్యవధిలో ఢీకొనే ప్రమాదాన్ని తప్పించుకున్నాయని అధికారులు తెలిపారు. ఈ రెండు విమానాలు కర్ణాటక రాజధాని బెంగళూరు వద్ద ఆకాశంలో కేవలం నాలుగు మైళ్ల దూరంలో ప్రయాణించినట్లు అధికారులు వెల్లడించారు. వాటి మధ్య ఎత్తులో తేడా కేవలం 200అడుగులు మాత్రమే ఉందన్నారు. ఈ ఘటన బుధవారం బెంగళూరు ఎయిర్‌బేస్‌లో జరిగినట్లు తెలిపారు. ట్రాఫిక్ కొలిషన్ అవాయిడెన్స్ సిస్టమ్(టీసీఎఎస్) ద్వారా హెచ్చరిక జారీ చేయడంతో రెండు విమానాల్లోని పైలట్లు వెంటనే స్పందించి ప్రమాదం జరగకుండా నివారించగలిగినట్లు పేర్కొన్నారు. జులై 10న కోయంబత్తూరు-హైదరాబాద్, బెంగళూరు-కొచ్చి మార్గాల్లో ప్రయాణిస్తున్న తమ విమానాల్లో టీసీఎఎస్ -రీ సొల్యూషన్ అడ్వైజరీ సిస్టమ్ పైలట్లను హెచ్చరించినట్లు ఇండిగో ఒక ప్రకటనలో తెలిపింది.

# కొల్లేటికోట వంతెనను పరిశీలించిన కామినేని



**రాజధాని వార్తలు ప్రతినిధి, కృష్ణా :** కృష్ణాజిల్లా కైకలూరు మండలంలో కొల్లేటికోట వంతెన పనులను ఎమ్మెల్యే కామినేని గురువారం పరిశీలించారు. సుమారు 14 కోట్ల వ్యయంతో బ్రిడ్జిని నిర్మిస్తున్నామన్నారు. వచ్చే సంవత్సరం మార్చి నెలాఖరుకు వంతెన నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు బ్రిడ్జి నిర్మాణానికి దళితుల నుంచి అదనంగా సేకరించిన 21 వేల ఎకరాల మిగులు భూముల్ని తిరిగి ఇస్తున్నామన్నారు.

# ఫైనల్స్‌కు చేరిన క్రొయేషియా



(మొదటిపేజీ తరువాయి)

ఫైనల్ చేరిన చిన్న దేశంగా క్రొయేషియా చరిత్ర సృష్టించింది. అంతేకాదు తక్కువ ర్యాంకులో ఉన్న ఓ జట్టు ఫైనల్ చేరడం ఫిఫా చరిత్రలో ఇదే తొలిసారి. ప్రస్తుతం క్రొయేషియా ర్యాంకు 20గా ఉంది. ఎటువంటి అంచనాలు లేకుండా ఈ వరల్డ్ కప్ బరిలోకి దిగిన క్రొయేషియా తన సంచలన ప్రదర్శనతో వరల్డ్ కప్ ఫైనల్‌కు చేరింది.


**గ్రూప్ స్టేజిలో అద్భుత విజయాలు**

ఫైనల్స్‌కు చేరే క్రమంలో క్రొయేషియా 2014 వరల్డ్ కప్ రన్నరప్ జట్టు అర్జెంటీనాతో పాటు నైజీరియా, ఐస్‌ల్యాండ్ జట్లను గ్రూప్ స్టేజిలో ఓడించింది. నాకౌట్ స్టేజిలో డెన్మార్క్ జట్టుపై 3-2తేడాతో విజయం సాధించిన క్రొయేషియా క్వార్టర్ ఫైనల్లో రష్యాపై పెనాల్టీ షూటౌట్ ద్వారా 4-3తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. సెమీఫైనల్లో పటిష్ట ఇంగ్లాండ్‌పై 2-1తో విజయం సాధించి వరల్డ్ కప్ ఫైనల్‌కు చేరి చరిత్ర సృష్టించింది.

**సంబరాల్లో క్రొయేషియా ప్రజలు**

జనాభా పరంగా చాలా చిన్నదేశమైన క్రొయేషియా వరల్డ్ కప్ ఫైనల్‌కు చేరడంతో ఆ దేశ ప్రజలు సంబరాల్లో మునిగిపోయారు. ప్రస్తుతం ఆ దేశ ప్రజలంతా ఫ్రాన్స్‌తో జరగనున్న వరల్డ్ కప్ కోసం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ వరల్డ్ కప్‌లో క్రొయేషియా తన చివరి మూడు మ్యాచ్‌లను అదనపు సమయంలో గెలవడం విశేషం.

# ఉక్కు కర్మాగారంలో గ్యాస్ లీక్.. ఆరుగురి మృతి



**రాజధాని వార్తలు ప్రతినిధి, అనంతపురం :** జిల్లాలోని తాడిపత్రి స్టీల్ ప్లాంట్(గెరుడౌ)లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. గ్యాస్(విష వాయువులు) లీకవడంతో అక్కడ పనిచేస్తున్న ఆరుగురు సిబ్బంది మృతి చెందారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అస్వస్థతకు గురైనవారిని అనంతపురం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్టీల్ ప్లాంట్ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోని కారణంగానే ప్రమాదం జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరుగురు మృతి చెందడంతో వారి బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని మృతుల బంధువులు కోరుతున్నారు అనంతపురంతోపాటు ఒడిశా, బీహార్ రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఈ ప్లాంట్‌లో పనిచేస్తున్నారు.

# రైల్వే ప్రయాణికులకు శుభవార్త..

- మొబైల్ యాప్‌పై టికెట్ల బుకింగ్
- 15 అర్ధరాత్రి నుంచి సేవలు



**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** ఇకపై రైల్వే సాధారణ ప్రయాణికులు తమ టికెట్లను మొబైల్ యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో యూటీఎస్ ఆన్ లైన్ మొబైల్ యాప్ ను దక్షిణ మధ్య రైల్వే రూపొందించింది. ఈ యాప్ ను దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్ కుమార్ గురువారం ఆవిష్కరించారు. రిజర్వేషన్లు లేని సాధారణ ప్రయాణికుల కోసం యూటీఎస్ యాప్ ను ఆవిష్కరించామని, ఈ నెల 15 అర్ధరాత్రి నుంచి ఈ యాప్ సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని అన్ని రైల్వేస్టేషన్లలో ఈ యాప్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చని, ప్లాట్ ఫాం టికెట్లను కూడా దీని ద్వారా బుక్ చేసుకోవచ్చని, యూటీఎస్ యాప్ సేవలను త్వరలోనే దేశ వ్యాప్తంగా అందిస్తామని వెల్లడించారు.

# ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు వచ్చి చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అత్తిలి, ఉండ్రాజవరం, తణుకు, ఇరగవరం మండలాల్లో పంటలు నీట మునిగాయి. భారీ వర్షాలతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇక పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి వరద అంతకంతకూ పెరుగుతోంది.

వరద ఉధృతి మరింత పెరిగితే స్పిల్‌వే పనులు నిలిచే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వరద నీరు అధికంగా ఉండటంతో వారం క్రితమే కాపర్ డ్యామ్ పనులు నిలిచిపోయాయి. కోనసీమలో ఖరీఫ్ నారుమళ్లకు తీవ్రమైన నష్టం ఏర్పడింది. ముంపునీరు దిగక నారుమళ్లు కుళ్లిపోతున్నాయి. నారుమడుల్లో నుంచి ముంపు నీటిని బయటకు పంపేందుకు రైతులు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. మరోవైపు లోతట్టు ప్రాంతాలు కాకుండా మాగానిలో మెరకప్రాంత ఆయకట్టులో ఖరీఫ్ నాట్లు పడుతున్నాయి. వర్షాల కారణంగా ఈ పనులు వేగంగా ముందుకు సాగడం లేదు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ 20 రోజుల పైబడి వృధా అయిపోయింది. ఈ ప్రభావం పంట చేతికొచ్చే సమయంపై పడుతుందని రైతులు కలవరపాటుకు గురవుతున్నారు.

# 14న దళిత రాష్ట్ర సదస్సు

**రాజమహేంద్రి :** నగరంలో నిర్వహించనున్న దళిత రాష్ట్ర సదస్సు జాతా గురువారం ప్రారంభమయ్యింది. ఈ నెల 14 న రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న దళిత రాష్ట్ర సదస్సును జయప్రదం చేయలని కోరుతూ రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ దగ్గర ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రచార జాతా ప్రారంభమైంది. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సభ్యులు దడాల సుబ్బారావు, రాష్ట్ర కేవీపీఎస్ అధ్యక్షులు మాల్యాద్రి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి జాతాను ప్రారంభించారు. 14న నిర్వహించనున్న దళిత రాష్ట్ర సదస్సు ను జయప్రదం చేయలని కోరారు.

# పురుగుమందులతో ఆహారపంటలకు హాని

పంటలమీద పురుగుమందులను చల్లి క్రిమికీటకాలను చంపటం వల్ల పంటదిగుబడి పెరుగుతుందని సాధారణంగా భావిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా క్రిమికీటకాలు పంటలు ఆశించకుండా మందులు చల్లడం ఎక్కువే. అయితే ఈ పురుగుమందులు సృష్టిస్తున్న వాతావరణ కాలుష్యం చాలా ఎక్కువగా ఉందని, వీటిలో ఉండే రసాయనాల ప్రభావం ఆహారపంటల ఉత్పత్తిపైన తీవ్ర ప్రతి కూల ప్రభావం చూపుతుందని శాస్త్రవేత్తల బృందం తాజా అధ్యయనం వెల్లడించింది. ప్రస్తుతం శాస్త్రవేత్తలు తమ అధ్యయనాన్ని 1956లో రేచల్‌కార్సన్ రచించిన 'సైలింటస్ప్రింగ్' గ్రంథంలో పేర్కొన్న అంశాలతో పోల్చి చెప్పారు. డిడిటి, ఇతర పురుగు మందులు వాడటం వలన పక్షులు, కీటకాలు చనిపోతున్నాయని ఆ పుస్తకంలో కార్సన్ హెచ్చరించారు. దీంతో అప్పుడే డిడిటి, ఇతర కీటక నాశన మందులు వాడకాన్ని నిషేధించాలని ఉద్యమం చేశారు. ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా లక్షలకోట్ల రూపాయల విలువైన న్యూరో టాక్సిన్స్ పురుగుమందులువాడు తున్నారు. వీటి ప్రభావం చాలాకాలం అలా ఉంటుంది. అయితే విషప్రభావం



జనా వాసాలపైన ఉండకుండా నిరోధించే నియమనిబంధన లను మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ అంశాలపైన అంతర్జాతీయ వేత్తల బృందం అధ్యయనం జరిపి ఈ నిర్ధారణలు చేసింది. ఈ పురుగు విషప్రభావం వల్ల ఆహారఉత్పత్తికి తోడ్పడే క్రిమికీటకాలు, తేనెటీగలు, వానపాములు లాంటివి చనిపోతున్నాయి. వీటికి హాని జరగకుండా ఉండాలంటే క్రమంగా రసాయనమందుల ఉత్పత్తి వాడకం నిలిపివేయాలని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. వీరి అంచనా ప్రకారం ప్రతి సంవత్సరం రైతులు 2.6 బిలియన్ డాలర్ల విలువైన కీటకనాశని నియోనికోటి నాయిడ్స్ వినియోగిస్తున్నారు కీటకాలు పంటలను ఆశిస్తున్నాయా లేదా అనే దానితో నిమిత్తం లేకుండా ప్రచారానికి లోనై నియోనికోటిన్స్‌ను వాడుతున్నారని, ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, వీటిని వాడితే పంటల దిగుబడి పెరుగుతుందన్న ఆధారాలు ఏమాత్రం లేవని శాస్త్రవేత్తలు చెపుతున్నారు. డిడిటిని వాడటం వల్ల జరిగే హానితో సమంగా సహజసిద్ధమైన, వ్యవసాయ వాతావరణానికి హాని జరిగి ఉత్పత్తికి ముప్పు ఏర్పడిందన్న నిర్ధారణలున్నాయని అధ్యయనం జరిపిన శాస్త్రవేత్తలలో ఒకరైన ఫ్రాన్సు జాతీయపరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త జీన్-మార్క్ జాన్మటిన్ తెలిపారు. మొత్తం 29మంది శాస్త్రవేత్తలు నాలుగు సంవత్సరాలు అధ్యయనం చేసి ఈ అంశాలను నిర్ధారించారు. ప్రపంచంలో మూడు వంతులకు పైగా పంటల ఉత్పత్తికి సహ కరించే, భూమిని సారవంతం చేసే తేనె టీగలు, ఇతర క్రిమికీటకాలు రసాయ నాలు చంపివేస్తున్నాయని, దీని వలన ఆహారపంటలపైన తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని జీన్-మార్క్ జాన్మటిన్ తెలినారు. 'ఎన్విరాన్‌మెంటల్ సైన్సు అండ్ పొల్యూషన్ రిసెర్చ్' పత్రికలో వీరి అధ్యయనం ప్రచురించారు.

## కాలమ్

నా దేశంలో ప్రతి మనిషికో మతం ఉంది,
కాని మానవత్వమె వెతకాలి...
నా దేశంలో ప్రతి కులనికో సంఘం ఉంది,
కాని సమానత్వమె వెతకాలి...
నా దేశంలో ప్రతి వీధికో నాయకత్వం ఉంది,
కాని న్యాయం కోసం వెతకాలి...
నా దేశంలో ప్రతి ఊరికో పార్టీ ఉంది కాని,
ప్రజాప్రతినిధి కోసమె వెతకాలి..
నా దేశంలో ప్రతి రాష్ట్రనికో ప్రభుత్వం,
ఉంది కాని ప్రజాస్వామ్యమె వెతకాలి..
నా దేశంలో ప్రతి ఇంటికో స్త్రీ ఉంది కాని
రక్షణ కోసమె వెతకాలి..
నా దేశంలో ఏళ్లనాటి స్వాతంత్ర్యం ఉంది
కాని స్వేచ్ఛ కోసమె వెతకాలి.........

# రూ.7 లక్షల కోట్లకు చేరువలో రిలయన్స్..



**న్యూఢిల్లీ :** రిలయన్స్ ఇండస్ట్రీస్ విజయ పరంపర కొనసాగుతోంది. గురువారం ట్రేడింగ్ ప్రారంభంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ స్టాక్‌దూసుపోయింది. దీంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ 100 బిలియన్ డాలర్ల(రూ.6,85,550 కోట్లకు పైగా) మార్కును దాటేసింది. అంటే 7 లక్షల కోట్లకు చేరువలోకి వచ్చింది. కంపెనీ షేర్లు రూ.1,091 వద్ద 52 వారాల గరిష్టాన్ని తాకడంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో ఈ మేర పెరిగింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు ఈ మేర దూసుకుపోవడం వరుసగా ఇది ఐదోరోజు. జూన్ క్వార్టర్ ఫలితాలకు ముందు కంపెనీ ఏజీఎంలో దూకుడు వ్యాపార ప్రణాళికను ప్రకటించిన నేపథ్యంలో రిలయన్స్ షేర్లు ఈ మేర లాభాలను ఆర్జిస్తున్నాయి. గురువారం ఈ కంపెనీ షేర్లు రూ.1,043.15 వద్ద ప్రారంభమయ్యాయి. అనంతరం రూ.1,091 వద్ద వెంటనే 52 వారాల గరిష్టాలను తాకాయి. నిన్నటి ముగింపుకు ఇది 5.27 శాతం అధికం. ఎన్ఎస్ఈలోనూ రిలయన్స్ స్టాక్ ఈ విధంగానే ట్రేడవుతుంది. 5.02 శాతం జంప్ చేసి, రూ.1,091 వద్ద 52 వారాల గరిష్టాన్ని తాకింది. కంపెనీ ఈ విధమైన మైలురాయిని 2007 అక్టోబర్‌లో సాధించింది. మరోవైపు స్టాక్ మార్కెట్లు సైతం ఈ విధంగానే దూసుకుపోతున్నాయి. సెన్సెక్స్ 400 పాయింట్ల మేర ర్యాలీ జరిపి, 36,697 వద్ద రికార్డులను స ృష్టిస్తోంది. నిఫ్టీ సైతం 11 వేల మార్కును అధిగమించేసి ట్రేడవుతోంది. కాగ, రిలయన్స్ ఇండస్ట్రీస్ గత వారంలోనే తన వార్షిక సాధారణ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో టెలికాం దిగ్గజాలకు మరింత షాకిస్తూ తన దూకుడు వ్యాపార ప్రణాళికను వెల్లడించింది. ఇక అప్పటి నుంచి స్టాక్ పైపైకి దూసుకుపోతూనే ఉంది. జూలై 5 నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్ కంపెనీ షేర్లు 13.05 శాతం లాభపడ్డాయి. ఏజీఎంలో ముఖేష్ అంబానీ కస్టమర్లు ఎంతో కాలంగా వేచిచూస్తున్న అల్ట్రా హై-స్పీడ్ ఫిక్స్‌డ్ లైన్ ఫైబర్ బ్రాడ్‌బ్యాండ్‌ను లాంచ్ చేశారు. ఆగస్టు 15 నుంచి ఈ సర్వీసులను అందుబాటులోకి తీసుకొస్తున్నారు.

# ఇందిర విగ్రహం ధ్వంసం



**రాజధాని ప్రతినిధి, మాచర్ల :** పట్టణంలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిలో స్వర్గీయ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహం ధ్వంసం చేయడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. జోహార్ ఇందిరా.. జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న అర్బన్ సీఐ సాంబశివరావు అక్కడకు చేరుకొని విచారణ చేపట్టారు. ప్రత్యక్ష సాక్షులు పలువురు లారీ ఢీకొనడం వల్ల విగ్రహం ధ్వంసమైనట్లు తెలిపారు. లారీకి ట్రాక్టర్ అడ్డం రావడంతో దాన్ని తప్పించబోయి విగ్రహాన్ని ఢీకొన్నట్లు వివరించారు. అయితే, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రం ఇది కుట్ర అని, తమ పార్టీని బతకనివ్వకూడదన్న దురుద్దేశంతో కొందరు ఇలా వ్యవహరించారని ఆరోపించారు. విగ్రహాన్ని ప్రతిష్టించకపోతే ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన



**చిత్తూరు :** అగ్నిమపక శాఖ అధికారి ఎస్.ఐ మాబుసుబాన్ ఆధ్వర్యంలో నగరి నియోజకవర్గం నగరి మున్సిపాలిటీ పరిధిలోని ముడిపల్లి గ్రామంలో ఉన్న గవర్నమెంట్ హైస్కూల్‌లో అగ్ని ప్రమాదాల పై అవగాహన సదస్సు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ... ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఏదైనా ప్రమాదానికి గురైతే ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశం పై అక్కడ ఉన్న విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రదర్శన రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సుబ్బరాయులు, ఢిల్లీబాబు, ఖాళీ, సుబ్రహ్మణ్యంరెడ్డి, కాళీ, చంద్రన్ పాల్గొన్నారు.

# రాజకీయాల్లో షర్మిలా పున:ప్రవేశం



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** గత ఎన్నికల్లో పోటీ చేయడం తొలిసారే అయినా వైసీపీ బాగా ప్రభావం చూపింది. దాదాపు అధికార టీడీపీతో సమానంగా ఓట్ల శాతం సంపాదించుకోగలిగింది. అయితే చంద్రబాబు అనుభవానికే జై కొట్టిన ఆంధ్రా ప్రజలు ఆయననే సీఎం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఈ సీన్ రిపీట్ కాకూడదని ప్రతిపక్ష వైసీపీ భావిస్తోంది. అందుకోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. ప్రధానంగా పోటీలో నిలబెట్టే అభ్యర్థుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటోంది. కేవలం గెలుపు గుర్రాలకే టికెట్లు ఇవ్వాలని భావిస్తున్న ఆ పార్టీ అధిష్టానం అందుకోసం పలు రకాల సర్వేలు చేయించింది. అంతేకాదు, అన్ని రంగాల్లో ఫ్యాన్ ఫాలోయింగ్ అధికంగా ఉన్న వారిని వెదికి పట్టుకుని వారికి వైసీపీ టికెట్లు ఇవ్వాలని చూస్తోంది. ఇందులో భాగంగా తన చెల్లెలు, జగనన్న విడిచిన బాణాన్ని అని చెప్పుకునే షర్మిలను ఎన్నికల బరిలో ఉంచాలని జగన్ నిర్ణయం తీసుకున్నాడట. ఈ వార్త ఇప్పుడు వైసీపీ శ్రేణుల్లో నూతనుత్తేజాన్ని నింపుతోంది. అవినీతి ఆరోపణలపై వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్ జైలుకెళ్లినప్పుడు ఆ పార్టీ బాధ్యతలు తీసుకున్నారు వైఎస్ షర్మిల. రాజన్న కూతురిని, జగనన్న విడిచిన బాణాన్ని అంటూ ఆమె రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 14 జిల్లాల్లో 3000 వేల పైచిలుకు కిలో మీటర్లు ఆమె యాత్ర చేశారు. తద్వారా ప్రపంచంలోనే అత్యధిక దూరం పాదయాత్ర చేసిన మహిళగా రికార్డులకెక్కారు. షర్మిలకు తగిన నియోజకవర్గాన్ని అన్వేషించే పనిలో ఉన్నారట జగన్ మోహన్ రెడ్డి. విశాఖపట్టణం, ఒంగోలు, రాయలసీమలోని పలు నియోజకవర్గాలను పరిశీలిస్తున్నట్టు సమాచారం. గత ఎన్నికల్లో విశాఖలో జగన్ తల్లి విజయమ్మ ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలైన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని వైసీపీ ధృవీకరించకపోయినప్పటికీ, ఆమె పోటీ చేయడం ఖాయమేనన్న ప్రచారం జరుగుతోంది.

# మేమైతే పోలవరం పూర్తిచేసేవాళ్లం : తులసిరెడ్డి



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** కాంగ్రెస్ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చి ఉంటే, పార్టీ మానసపుత్రికైన పోలవరం ప్రాజెక్టును ఈ పాటికే పూర్తి చేసి ఉండేదని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ తులసిరెడ్డి అన్నారు. దురదృష్టవశాత్తు కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రావడం వల్ల ఈ పనులు అనుకున్న స్థాయిలో జరగలేదని విమర్శించారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి పర్యటన ప్రజలను నమ్మించేందుకేనని విమర్శించారు. ఎపి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలు, పోలవరం నిర్మాణంపై ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టుకు కాంగ్రెస్ ప్రభుత్వమే అన్ని అనుమతులూ ఇచ్చిందన్నారు. పనుల జాప్యంతో సవరించిన రూ.54వేల కోట్ల అంచనాకు ఇంత వరకు ఆమోదం లేదని, ఇంతవరకు ఈ ప్రాజెక్టుకు రూ.13,798కోట్లు ఖర్చు కాగా, ఇంకా రూ.41,692 కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని వివరించారు. నిర్వాసితులకు న్యాయం చేసి, 2019 జూన్ నాటికి కేంద్రప్రభుత్వ నిధులతో ప్రాజెక్టు పూర్తి చేయాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

## ఎన్నికల్లో పోటీ చేయను : యనమల


**మోడీకి మద్దతు తెలపను అని జగన్, పవన్ అనట్లేదు**



**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం కావాలని, తమ ప్రభుత్వం నాలుగేళ్లుగా అవే చేస్తుందని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. తాజాగా ఆయన ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... తాము ఎన్డీఏలోంచి ఇలా బయటకు రాగానే వైసీపీ అధినేత జగన్ అందులో చేరారని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీలకు మద్దతు తెలపను అని జగన్, పవన్ అనట్లేదని అన్నారు. బీజేపీతో కలిసి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాలని వారు అనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. బీజేపీతో కుమ్మక్కయినందుకే జమిలి ఎన్నికలకు జగన్ జై కొట్టారని అన్నారు. తనకు ఇక ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచన లేదని యనమల అన్నారు.

## ఫార్మాకు ఇక మంచి రోజులు

**తొలి త్రైమాసికంలో 17 శాతం వృద్ధికి అవకాశం**



**ముంబై :** ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఫార్మా రంగం 17 శాతం వృద్ధిని సాధించవచ్చునని ఎడిల్‌వైజ్ సెక్యూరిటీస్ విశ్లేషించింది. దేశీయ అమ్మకాల్లో వృద్ధితో పాటు డాలర్ బలపడడం ఫార్మా రంగానికి సానుకూలం శాలుగా పేర్కొంది. దేశీయ అమ్మకాల్లో 26 శాతం వృద్ధిని నికరలాభం 50 శాతం వృద్ధినే సాధించే అవకాశాలున్నాయని విశ్లేషించింది.అమెరికన్ మార్కెట్‌లో అమ్మకాలు 6 శాతం మేర పెరగవచ్చునని అంచనా వేసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 4 శాతం నష్టపోగా,యూరోతో 11 శాతం, యెన్‌తో 5 శాతం చొప్పున రూపాయి మారకం విలువ తగ్గింది.దీంతో స్థూల లాభ మార్జిన్లు ఈ త్రైమాసికంలో ఒక శాతం, సంవత్సరానికి 3.5 శాతం మేర పెరుగుతాయని అంచనా వేసింది.ఎఫ్‌డీఏ అనుమతులు కూడా ప్రోత్సహకరంగా ఉండడం మరో సానుకూలాంశంగా పేర్కొంది. సన్‌ఫార్మా హలోల్ ప్లాంటుకు, డాక్టర్ రెడ్డీస్‌కు చెందిన మెదక్, శ్రీకాకుళం ఎస్ఈజడ్‌లకు, కాడిలా ప్లాంట్‌కు అనుమతి లభించడంతో ఫార్మా రంగంలో ప్రతికూల పరిస్థితులు తొలగిపోయినట్టుగా పేర్కొంది. అయితే అమెరికన్ మార్కెట్‌లో ధరల తగ్గింపు ప్రధాన సవాల్‌గా ఎడిల్‌వైజ్ పేర్కొంది.గ్లోబల్ ఫార్మా మార్కెట్‌లో దేశీయ ఫార్మా పరిశ్రమ వాటా అమ్మకాల్లో 3.1 నుంచి 3.6 శాతంకాగా, పరిమాణంలో దాదాపు 10 శాతం. 2025 నాటికి 100 బిలియన్ డాలర్లకు చేరుకుంటుంని ఆ నివేదిక పేర్కొంది.

## గురుకుల పాఠశాల సాధన కోసం 30న సీపీఐ దీక్ష

**సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల**



**రాజధాని వార్తలు ప్రతినిధి, తుళ్ళూరు :** రాజధాని పరిధిలోని బాలబాలికలకు ఉపయోగపడేలా గురుకుల పాఠశాల నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న దీక్ష నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుళ్ళూరు ప్రాంతంలోనూ, రాజధాని ప్రాంతంలోనూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న పార్టీ సీపీఐ అన్నారు. రాజధాని ప్రాంతాన్ని తుళ్ళూరుగా ప్రకటించిన తర్వాత అనేక పార్టీలు వ్యతిరేకించినా సీపీఐ మొదటిగా స్వాగతించిందన్నారు. రాజధాని ప్రాంతంలో సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వినతి పత్రం అందజేశామన్నారు. ఈ ప్రాంతంలో స్కిల్ డెవలప్‌మెంట్ క్లాసులు నిర్వహించి శిక్షణ ఇచ్చారు. తప్ప ఉద్యోగాలు ఇచ్చే పనిచేపట్ట లేదన్నారు. వ్యవసాయ కార్మికుల పింఛన్ పెంచాలని, పింఛన్ సరైన పద్ధతిలో ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో భూమిలేని ప్రతి పేదవాడికి 3 ఎకరాలు ఉచితంగా భూమి, పంపిణీలో దళిత, గిరిజనులకు 50శాతం నిబంధన అమలు చేయాలన్నారు. వ్యవసాయ కార్మికులకు లక్ష వరకు అప్పులను ప్రభుత్వం చెల్లించాలన్నారు. లంక, ఎసైన్డ్, సొసైటీ భూముల సమస్యలు అలానే ఉన్నాయని, రైతుకోన్యాయం, దళితుడైన ఎసైన్డ్ భూమిలో ఉన్న పేదవాడికి ఒక న్యాయం సరైన పద్ధతి కాదన్నారు. మామూలుగా రైతులకు ఇచ్చిన ప్యాకేజి ఎసైన్డ్ భూమి రైతుకు ఇవ్వాలని, వాటి కోసం భవిష్యత్తులో ఉద్యమం చేస్తామని, రాజధాని ప్రాంతంలో గురుకుల పాఠశాల నిర్మించాలన్నారు. సమితి సహకారంతో ఉద్యమాన్ని ఈనెల 30 నుంచి మొదలు చేస్తామన్నారు. సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి పచ్చల సాంబశివరావు, మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి కే కాశయ్య, ఏఐటీయూసీ రాజధాని ప్రాంత కార్యదర్శి జీవీ రాజు, జీ వెంకేటశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే ఈశ్వరరావు, తదితరులు పాల్గొనారు.

## అన్ని ఎన్నికలు ఒకేసారి : సీఎం చంద్రబాబు

**రాజధాని వార్తలు అమరావతి :** రాష్ట్రంలో అన్ని ఎన్నికలు ఒకేసారి జరుగుతాయని, స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో తెలంగాణకు కోర్టు ఏదైతే చెప్పిందో అదే మనకూ వర్తిస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. అమరావతిలో గురువారం నిర్వహించిన టీడీపీ నేతల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీజేపీకి ఇబ్బంది ఉందనే జమిలి ఎన్నికలు అంటోందని ఆయన విమర్శించారు.


# రాజధాని క్లాసిఫైడ్స్

### నివాస ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో **500, 1000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ :**9440662699**

**రాయపూడి**
రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామ పరిధిలో **500, 1000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : **9908244333**

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో **500, 1000, 2000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్: **9440662699**

### ఇతరములు

వెంకటపాలెం
సాయిలాస్య రియల్‌ఎస్టేట్ & ఫైనాన్స్ కన్సెల్టెన్సీ, గాదె నాగేశ్వరరావు
ఫోన్ : **951515393**

**మందడం**
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : **9553023388**

**వెలగపూడి**
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : **9640811333**

**రాయపూడి**
చంద్రిక ట్రెడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : **9908073516**

**రాయపూడి**
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ **9848021898**

**రాయపూడి**
రియల్‌ఎస్టేట్ క్రయ,విక్రయాలకు సంప్రదించడం న్యూసింగపూర్ రియల్ ఎస్టేట్
ఫోన్ : **9848442436**

### షాప్స్

**తుళ్ళూరు**
రేమాండ్స్‌ట్రైలర్స్
ఫోన్ : **9492470426**

**రాయపూడి**
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : **9985853188**

**తుళ్ళూరు**
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : **9848407935**

**తుళ్ళూరు**
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : **9581500500**

**తుళ్ళూరు**
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :**9247171083**

**రాయపూడి**
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : **9603990791**

**తుళ్ళూరు**
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ **9440307123**

### హస్పటల్స్

**విజయవాడ**
ఆంధ్ర హస్పటల్, డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : **9177219900**

**విజయవాడ**
ఇంధిరారావు మెడికేర్ (సెంటర్)
ఫోన్ : **9440421580**

**విజయవాడ**
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : **9849122788**

**విజయవాడ**
అష్రఫ్ మెటర్నిటీ & ఇ.ఎన్.టి డా॥ రెహమాన్
ఫోన్: **0866-2475087**

**విజయవాడ**
శ్రీమానస సైకియాట్రిక్ డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:**0866-2436647**

విశాఖపట్నం
చింతలూరు ఆయుర్వేద డా॥ విశ్వనాథ్
ఫోన్ :**90329 90138**

### వాణిజ్య ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో **500, 1000, 2000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : **9440662699**

**ఐనవోలు**
రాజధాని ప్రాంతంలోని ఐనవోలు గ్రామ పరిధిలో **500, 1000, 2000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : **9908244333**

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో **500, 1000, 2000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : **9440662699**

### విద్యా సంస్థలు

ఐనవోలు
విఐటీ-ఏపీ యూనివర్శిసిటీ
ఫోన్ :**0863 2370444**

నీరుకొండ
ఎస్ఆర్ఎమ్ యూనివర్శిసిటీ
ఫోన్ :**0863 2343000**

**గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.**

**- మేనేజర్**

ప్రకటనలకు సంప్రదించండి 9493170689

# మృత్యుంజయులు

**ఇదే ఘటన భారత్‌లో జరిగి ఉంటే అధికార, ప్రతిపక్షాలు పరస్పరం విమర్శలు కురిపించుకునేవి. అంతేకాదు.. టీవీ ఛానల్స్ లైవ్ డిబేట్ ఏర్పాటు చేసి పిల్లలు బ్రతుకుతారా లేదా అంటూ పోలింగ్ నిర్వహించేవారు. ప్రభుత్వం ఏ చర్యలు చేపట్టినా ప్రతిపక్షాలు విమర్శలు చేసేవి.లేదంటే ఏ మతానికి చెందిన పిల్లలు ఎక్కువగా ఉన్నారో తెలుసుకొని అందుకు తగ్గట్లుగా అధికార బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు అనేక వ్యాఖ్యానాలు చేసేవారు. దీంతో తల్లిదండ్రులు మరింత భయాందోళనలకు గురయ్యేవారు. ప్రజలు రెండు వర్గాలుగా విడిపోయేవారు.**









జపాన్ తర్వాత అత్యంత క్లిష్ట పరిస్థితులను ఓర్పు, నేర్పుగా పరిష్కరించుకునే దేశంగా థాయ్‌లాండ్ గుర్తుంపు తెచ్చుకుంది. 18 రోజుల పాటు చీకటి, వరదనీటిలో చిక్కుకు పోయినా కోచ్ సాయంతో 12 మంది పిల్లలు తమ మానసిక పరిస్థితిని సమతుల్యంగానే ఉంచుకున్నారు. అదేసమయంలో థాయ్ ప్రభుత్వం వ్యవహరించిన తీరుకూడా అభినందనీయం. ఈ విషయంలో ఎవరినీ తప్పుపట్టనవసరం లేదని, అది యాదృచ్ఛితంగా జరిగిన సంఘటని బాధిత బాలలు వెల్లడించడం వారి మానసిక పరిణితికి అద్దంపడుతోంది. వర్షం కోసం గుహలోనికి వెళ్లిన వైల్డ్‌బోర్ సాకర్ ఫుట్ బాల్ ఆటగాళ్లు వరదనీరు అందులో ప్రవేశించడంతో కొద్దికొద్దిగా లోపలికి జరుగుతూ పూర్తిగా బయటికి రాలేని పరిస్థితికి వెళ్లిపోయారు. వారి వద్దనున్న సెల్ఫీని పోస్టు చేసిన తర్వాత గాని ఆ విషయం బయటి వారికి తెలియలేదు. అప్పటి నుంచి థాయ్ ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేసింది. అక్కడి నౌకాదళం కూడా శక్తివంచన లేకుండా దుర్భేద్యమైన ఆ గుహకు రంధ్రం చేసి ఒక్కొక్కరినీ బయటకు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఆస్ట్రేలియా, బ్రిటన్ , అమెరికా దేశాలు థాయ్‌కు బాసటగా నిలిచాయి.

పిల్లలను బయటకు తీసుకొచ్చేందుకు 8 మిల్లీ మీటర్ల తాడును ఉపయోగించారు. సహాయక బృందం పిల్లలను బయటకు తీసుకు వచ్చేందుకు ఒక స్విమ్మింగ్ ఫూల్‌లో సాధన చేశారు. ఒక్కో బాలుడిని బయటకు తీసుకు పంపేందుకు దాదాపు 100 మంది రెస్క్యూ ఆపరేషన్ సిబ్బంది గుహలో ఉన్నారు. క్రీడాకారులను బయటికి వచ్చే మార్గం అత్యంత ప్రమాదకరంగా ఉండటంతో పిల్లలు బయపడకుండా ఉండేందుకు ఆస్ట్రేలియాకు చెందిన అనస్థీషియన్ డాక్టర్ హెర్రీ వారికి మత్తు మందులను ఇచ్చారు. దాంతో వారు నిద్రపోవడం , లేదంటే మగతా ఉండటంతో సులువుగా బయటకు వచ్చారు. పిల్లల మనోధైర్యాన్ని కాపాడటంలో ప్రముఖ పాత్ర పోషించిన కోచ్ ఏక్‌పోల్ అభినందనీయుడు. అంతకుముందు ఆయన బౌద్ధ భిక్షుడిగా ఉండటంతో ఆయన ధ్యానం ప్రాణామాయ, ఆహారం లేకుండా బ్రతకడం, బురదనీటిని శుభ్రం తీసుకోవడం వంటి వాటిలో పిల్లలకు శిక్షణ ఇచ్చారు. బాధిత బాలురలో ఒకరికి మాత్రమే న్యుమోనియా సోకిన వార్తలు ఉన్నాయి గాని మిగతా పిల్లలందరూ సామాన్యంగా ఉన్నట్లు చెప్పవచ్చు. వారికి 10 రోజులపాటు ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తామని థాయ్ ప్రభుత్వం వెల్లడించింది. ప్రపంచం అంతా ఉగ్గబట్టి చూసిన ఈ ఘటన సుఖాంతం కావడం ఆనందం మిగిల్చింది. థాయ్ ప్రజలు ఈ ఆనందాన్ని పండుగలా నిర్వహించుకున్నారు. ఈ సాహస కథతో హాలివుడ్ రూ. 413 కోట్లతో ఒక సినిమాను నిర్మిస్తోంది.






ఎంతటి అభివృద్ధి సాధించినా, ఉపద్రవాలు, భూకంపాలతో అతలాకుతలం అయ్యే జపాన్ ప్రజలు వారి హృదయ వేదనను నిశ్శబ్దంగా కన్నీళ్లరూపంలో బయటకు తెచ్చుకుంటారు తప్ప ఎటువంటి పరిస్థితుల్లోనూ ఆందోళనలకు, విమర్శలకు తావీయరు. అదే కోవలో అతిచిన్న దేశమైన థాయ్ కూడా క్రమశిక్షణతో వ్యవహరించడం ముదావహం. అక్కడి ప్రజలు ఈ క్లిష్టపరిస్థితిని అధిగమించాలని ఏక మనస్సుతో ప్రార్థనలు చేసి విజయం సాధించారు. క్రీడా కారులు గుహలో అనుసరించిన బౌద్ధ ప్రమా ణాలు వేదాల్లో ఉన్నాయని బీజేపీ ఎమ్మెల్యే, లేదా ఎంపీ రెండు మూడు రోజుల్లో ప్రకటించే అవకాశం లేకపోలేదు.

– ఖాన్




నా లోన చిగురించిన తొలకరి ప్రాణమా !
నన్ను ధన్యుడును చేసినా "ప్రణవ ",ప్రణామము!!
నా ప్రాణాయమం కిరణమా !
నాకు ప్రణయం అందించినందుకు " ప్రణవ",ప్రణామము !!
నా మీద మాగాణి పండిచిన గణ కరుణమా!
నా ఓంకరా భరణం నన్ను అలంకరిచినందకు
" ప్రణవ", ప్రణామము !!

తండ్రి
నందిగామచంద్రశేఖర్

## నేడు కిరణ్‌కుమార్‌రెడ్డి,రాహుల్ భేటీ




**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి గురువారం దేశ రాజధాని ఢిల్లీ చేరుకున్నారు. శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో ఆయన భేటీ కానున్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో తిరిగి చేరనున్నారని కొద్దిరోజులుగా వార్తలు వస్తున్నాయి. ఇటీవల పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు కిరణ్ కుమార్‌రెడ్డితో భేటీ కావడం ఈ వార్తలకు మరింత బలం చేకూరింది. ఈ నేపథ్యంలో కిరణ్ కుమార్‌రెడ్డి, రాహుల్ గాంధీ భేటీ కానుండటంతో కాంగ్రెస్‌లో ఆయన పునః ప్రవేశం ఇక లాంఛనమేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా తుడుచుపెట్టుకుపోయిన సంగతి తెలిసిందే. ఏపీ ప్రజలు ఆ పార్టీలోని ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ స్థానంలో కూడా గెలిపించలేదు. అయితే ఇటీవల కాలంలో రాష్ట్రంలో రాజకీయ వేడి పెరిగింది. ప్రత్యేక హోదా సహా విభజన హామీలు నెరవేర్చడంలో బీజేపీ నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపిస్తూ అధికార తెలుగుదేశం పార్టీ ఎన్డీయే కూటమి నుంచి వైదొలగింది. ఈ క్రమంలోనే వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తొలి సంతకం ఏపీకి ప్రత్యేక హోదా దస్త్రం మీదే చేస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారు. ఇదే విషయాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు సభలు, సమావేశాల్లో చెబుతూ ప్రజల్లో బలంగా నాటుకునేలా ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే విభజన తర్వాత పార్టీని వీడిన నేతలను తిరిగి చేర్చుకుని రాష్ట్రంలో తిరిగి పట్టు సాధించాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. ఈ వ్యూహంలో భాగంగానే కిరణ్‌కుమార్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించాలని అధిష్ఠానం నిర్ణయించినట్లు సమాచారం.

## ఫ్లిప్‌కార్ట్ బంపర్ డీల్స్ 16 నుంచి ప్రారంభం

**న్యూఢిల్లీ :** అమెజాన్ ప్రైమ్ డే సేల్‌కు పోటీగా ఈనెల 16న ఫ్లిప్‌కార్ట్ బిగ్ షాపింగ్ డేస్ సేల్స్‌ను ప్రారంభించబోతోంది. 16 సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే సేల్ 19 వరకు కొనసాగనుంది. ఈ సేల్‌లో భాగంగా శాంసంగ్, గూగుల్, వివో సహ పలు బ్రాండ్ల స్మార్ట్‌ఫోన్లు రాయితీ ధరలతో లభిస్తాయి. గూగుల్ పిక్సెల్ 2(128జీబీ) ఫోన్ ఇప్పుడు రూ.42,999కే లభించనుంది. చాలా వరకు స్మార్ట్‌ఫోన్లకు బై బ్యాక్ గ్యారెంటీతోపాటు ఎక్స్‌చేంజ్ ఆఫర్ కూడా ఉంది. యాపిల్ వాచ్ సిరీస్ 3, ఐఫోన్ ఎక్స్, ఐప్యాడ్ సిక్స్త్ జనరేషన్, ఏసర్ ప్రిడేటర్ గేమింగ్ ల్యాప్‌టాప్‌లపై కూడా ప్రత్యేక డీల్స్ ఉన్నాయి. ఫ్లిప్‌కార్ట్ బిగ్ షాపింగ్ డేస్ సేల్‌ను పురస్కరించుకుని ఎస్‌బీఐ 10 శాతం తక్షణ క్యాష్ బ్యాక్ ఆఫర్‌ను ప్రకటించింది. సేల్‌లో భాగంగా ఫ్లిప్‌కార్ట్ రూ.70 వేల విలువైన గూగుల్ పిక్సెల్ 2 ఫోన్‌ను ఇప్పుడు 42,999కే అందించనుంది. అంటే రూ.27 వేల రాయితీ లభిస్తుందన్నమాట. ఎక్స్‌చేంజ్‌పై అదనంగా రూ.3వేలు, క్యాష్‌బ్యాక్‌గా రూ.8వేల ఇవ్వనుంది. అలాగే, 37వేల బై బ్యాక్ గ్యారెంటీ కూడా లభించనుంది. వివో వీ7 ప్లస్ 64 జీబీ వేరియంట్‌ను రూ.19,990, ఆనర్ 9ఐని రూ.14,999, పానసోనిక్ పీ65ని రూ.3999కే సొంతం చేసుకోవచ్చని ఫ్లిప్‌కార్ట్ తెలిపింది. వీటితో పాటు మరెన్నో డీల్స్ అందిస్తున్నట్టు ఫ్లిప్‌కార్ట్ పేర్కొంది.



## 90 ఏళ్ల వృద్ధురాలికి కృత్రిమ పేస్‌మేకర్

### విజయవంతంగా అమర్చిన ఆంధ్రా ఆస్పత్రి వైద్యులు

**రాజధాని ప్రతినిధి, విజయవాడ (లబ్బీపేట) :** విజయవాడ ఆంధ్రా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శ్రీమన్నారాయణ అరుదైన ఆపరేషన్ చేశారు.తొంబై ఏళ్ల వృద్ధురాలికి గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న ఆమెకు ఆర్టిఫిషియల్ పేస్‌మెకర్‌ను విజయవంతంగా అమర్చి జీవితాకాలాన్ని మరో పదేళ్లు పొడిగించారు.

## నాన్న సెంటిమెంట్ పనిచేస్తుందా ?

### విజేత 100 మూవీ రివ్యూ




చిరంజీవి అల్లుడు కల్యాణ్ దేవ్ విజేత ఈరోజు మెగా కుటుంబ అభిమానుల ముందుకు వచ్చింది. మొదటి చిత్రానికి తండ్రి, కొడుకుల మధ్య నడిచే భావోద్వేగాన్ని ఎంచుకున్నాడు. తొలిచిత్ర దర్శకుడు రాకేశ్ శశిని టాలీవుడ్‌కు పరిచయం చేశాడు.

విజేత కథ రామ్ (కల్యాణ్ దేవ్) ఇంజినీరింగ్ పూర్తి చేసి బాధ్యత లేకుండా తిరుగుతుంటాడు. తండ్రి శ్రీనివాసరావు ఓ కంపెనీలో మామూలు ఉద్యోగి. ఎదురింట్లోకి అద్దెకు వచ్చిన జైత్ర (మాళవిక నాయర్) హీరో ప్రేమిస్తుంటాడు. తనకు నచ్చిన పని చేయాలనే ఉద్దేశంతో లోకల్ బాయ్స్.. సర్‌ప్రైజ్ ప్లానర్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీని ప్రారంభిస్తాడు. రామ్ చేసిన ఓ పని కారణంగా తండ్రికి గుండెపోటు వస్తుంది. చెల్లెలి పెళ్లి కోసం భారీ కట్నం ఇవ్వాల్సిన సమస్య ఎదురవుతుంది.ఈ పరిస్థితుల్లో ఎవరు విజేతగా నిలుస్తారన్నదే కథాంశం.

తొలిభాగంలో విజేత సినిమా రెగ్యులర్ కమర్షియల్ అంశాలతో ప్రారంభమవుతుంది. హీరో ఇంట్రడక్షన్, పాట, అమ్మాయిని చూసి ఆకర్షణకు లోనవ్వడం అనే అంశాలు రొటీన్‌గా ఉన్నప్పటికీ.. ఫీల్‌గుడ్‌గా అనిపిస్తాయి. తండ్రి, కొడుకుల మధ్య ఎమోషనల్ సీన్లు తెరపైన కదలాడుతాయి. హీరోయిన్ తల్లి (ప్రగతి) బైక్ నడిపించే అంశాలు సాధారణ ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా ఉంటాయి. తండ్రి ఆరోగ్య సమస్య తలెత్తడం, అందుకు కారణం హీరోనే కారణం అనే ఎలిమెంట్‌తో విశ్రాంతి కార్డు పడుతుంది. రెండోభాగంలో రెండో భాగంలో జీవితంలో తనకు తాను నిలబడేందుకు చేసిన ప్రయత్నాలను ఆసక్తికరంగా తెరకెక్కించారు. ఇక సర్ప్రైజ్ ప్లానర్ ఈవెంట్‌లో భాగంగా ఓ కంపెనీ సీఈవో కుటుంబాన్ని కలిపే ఎపిసోడ్ సినిమాకు హైలెట్‌గా ఉంటుంది. ఓ ఉన్నత కుటుంబంలో నెలకొన్న విభేదాలను పరిష్కరించే అంశం. టాలీవుడ్‌లో మెగా కుటుంబం నుంచి హీరోగా వస్తున్నాడంటే మాస్, కమర్షియల్ అంశాలను భారీగా దట్టించి, సినిమా భారాన్ని మొత్తం హీరోపైనే వేస్తారు. సినిమా భారాన్ని తనపై వేసుకోకుండా జాగ్రత్త పడటం కల్యాణ్ టాలీవుడ్‌లో లాంగ్ ఇన్నింగ్స్ ఆడాలనే ప్రయత్నం కనిపిస్తుంది. డ్యాన్సులు, నటన, డైలాగ్ డెలివరీ, ఇతర అంశాలను మరింత మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉంది.మాళవిక నాయర్ గురించి జైత్రగా మాళవిక నాయర్‌కు అంతగా ప్రాధాన్యం లేని ఎదురింటి అమ్మాయిలానే కనిపించారు. విజేత చిత్రంలో అసలు విన్నర్ మురళీ శర్మ. వాస్తవ జీవితంలో ప్రతీ ఇంటిలో కళ్ల ముందు కనిపించే తండ్రిని గుర్తు తెచ్చేంతగా తన పాత్రకు ప్రాణం పోసారు. భారీ బడ్జెట్ చిత్రాలకు, ప్రజాదరణ పొందిన చిత్రాలకు పనిచేసిన సెంథిల్ కుమార్ విజేత చిత్రాన్ని తెర మీద ఆహ్లాదకరంగా రూపొందించడంలో తన మార్కును చూపించారు. విజేత చిత్రానికి హర్షవర్ధన్, రామేశ్వర్ సంగీతాన్ని అందించారు. భావోద్వేగంతో నడిచే సన్నివేశాలకు రీరీకార్డింగ్ అదనపు బలాన్ని ఇచ్చింది. కో కొక్కొరోకో, అడుగుగున, ఆకాశానికి తాకే పాటలు బాగున్నాయి. ఎడిటింగ్, ఇతర విభాగాలు కార్తీక్ శ్రీనివాస్ ఎడిటింగ్ ఫర్వాలేదు. తొలిభాగంలో కొన్ని సీన్లు కథ వేగాన్ని అడ్డుకునేలా ఉంటాయి. కామెడీ కోసం ఉంచడం వల్లనో ఏమో కథ నెమ్మదిగా నడిచినట్టు అనిపిస్తుంది. ఆర్ట్, ఇతర విభాగాల పనితీరు బాగుంది. ప్రొడక్షన్ వ్యాల్యూస్ విజేత చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ వరాహి సంస్థ రూపొందించింది. సాయి కొర్రపాటి, రజనీ కొర్రపాటి నిర్మాతలుగా వ్యవహరించారు. క్లాస్ టచ్‌తో సినిమాలోని ప్రతీ ఫ్రేమ్ రిచ్‌గా కనిపించింది. సాంకేతిక విభాగాల ఎంపిక బాగుంది. భారీగా హైప్ క్రియేట్ చేయకుండా లో ప్రొఫైల్‌లో సినిమాను విడుదల చేసినట్టు కనిపించింది. ప్రమోషన్‌తో మరింత ప్రేక్షకుల వద్దకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. ఫైనల్‌గా తండ్రి, కొడుకుల మధ్య సంఘర్షణ, భావోద్వేగంతో నిండిన కథ ఇది. మాస్, థ్రిల్లర్ సినిమాలతో విసిగిపోయిన ప్రేక్షకులకు విజేత కేరాఫ్ అడ్రస్ అని చెప్పవచ్చు. వారాంతంలో కుటుంబ ప్రేక్షకులు రెండు గంటలపాటు భావోద్వేగంతోపాటు చక్కగా వినోదించడానికి ఆస్కారం ఉన్న చిత్రం ఇది.




## వెండితెరకు వరం కార్తికేయ

### ఆర్ ఎక్స్ 100 మూవీ రివ్యూ




టాలీవుడ్‌లో చిన్న చిత్రాలకు, విభిన్నమైన కథాంశంతో రూపొందే చిత్రాలకు ప్రేక్షకుల విశేష ఆదరణ లభిస్తోంది. పెళ్లిచూపులు, మెంటల్ మదిలో, అర్జున్ రెడ్డి చిత్రాలు సాక్ష్యంగా నిలిచాయి. ఇలాంటి నేపథ్యంలో వచ్చిన చిత్రం 100. ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ శిష్యుడు అజయ్ భూపతి దర్శకుడిగా పరిచయం అయ్యాడు. కార్తికేయ, పాయల్ రాజ్‌పుత్ హీరో, హీరోయిన్లుగా టాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. రిలీజ్‌కు ముందే భారీ అంచనాలను సొంత చేసుకొన్న ఈచిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

**ఆర్ ఎక్స్ 100 కథ**

శివ (కార్తికేయ) తల్లిదండ్రుల లేని అనాథ. డాడీ (సింధూరపువ్వు రాంకీ) సంరక్షణలోపెరిగి పెద్దవుతాడు. డాడీ గ్రూప్‌లో కీలక సభ్యుడిగా ఉంటాడు. గ్రామ జెడ్పీటీసీ విశ్వనాథం (రావు రమేష్)కు అండగా ఉంటారు. హుషారుగా, అమాయకంగా ఉండే శివను విశ్వనాథం కూతురు ఇందు (పాయల్ రాజ్‌పుత్) ప్రేమలోకి దింపుతుంది. పీకల్లోతు ప్రేమలో మునిగిపోయిన శివ ఆమె ప్రపంచంగా జీవిస్తుంటాడు. ఇలాంటి పరిస్థితుల్లో మరో వ్యక్తిని పెళ్లి చేసుకుని అమెరికా వెళ్లిపోతుంది. ఇందూకు పెళ్లి అయిందని తెలిసినా ఆమె జ్ఞాపకాల్లోనే ఎందుకు బతికాడు. ఇందు కోసం మూడేళ్లు ఎదురు చూసిన శివకు ఆమె ప్రేమ దక్కిందా? ఇష్టంగా ప్రేమించిన శివను ఇందు ఎందుకు దూరం చేసుకొంది? సినిమా క్లైమాక్స్ ఎలాంటి మలుపులు తిరిగింది అనేదే చిత్ర కథ

అజయ్ భూపతి మేకింగ్ దర్శకుడు అజయ్ భూపతి నేటివిటి నేపథ్యంగా రాసుకొన్న కథ గ్రామీణ వాతావరణం అద్దం పట్టింది. గ్రామస్థాయి రాజకీయాలు, ఊర్లలో ఉండే నాటు సరసం, ప్రేమను చక్కగా ఒడిసిపట్టుకొని అద్భుతంగా దర్శకుడు తెరకెక్కించాడు. చివరి 25 నిమిషాల్లో సినిమాను నడిపించిన తీరు శెభాష్ అనిపించేలా ఉంది. తొలిభాగంలో మరికొంత దృష్టిపెట్టి ఉంటే ప్రేక్షకుల్లో ఏమైనా కొంత కలిగే అసంతృప్తిని కూడా తుడిచిపెట్టడానికి ఆస్కారం ఉండేది. ఆర్ఎక్స్ 100 సినిమా చూస్తే కొత్త దర్శకుడు తీసిన సినిమా అని ఎక్కడా అనిపించదు.

శివగా జీవించిన కార్తికేయ ఆర్ ఎక్స్ 100 చిత్రం హీరో కార్తికేయకు తొలి పరిచయం. శివ క్యారెక్టర్‌లో కార్తికేయ చూపిన వేరియేషన్స్ ఇటీవల కాలంలో మరే హీరోకు దక్కలేదని చెప్పవచ్చు. అమాయకుడిగా, ప్రేమికుడిగా, భగ్న ప్రేమికుడిగా, అన్యాయానికి గురైన యువకుడిగా, ప్రియురాలి మోసానికి గురై ఆవేదన చెందే ప్రియుడిగా ఇలా ఎన్నో షేడ్స్‌ను ఆ క్యారెక్టర్‌లో చూడవచ్చు. ఫైట్స్, యాక్షన్ ఎపిసోడ్స్‌లోను బాగా రాణించాడు.

గ్లామర్‌తో అదరగొట్టిన రాజ్‌పుత్ పోషించిన ఇందు పాత్రను అందాల ఆరబోతకే పరిమితవుతున్నారనే విమర్శకు చెక్ పెట్టే విధంగా ఇందు పాత్రను దర్శకుడు రూపొందించారు. క్యారెక్టర్‌కు తగినట్టే పాయల్ ఆ పాత్రలో జీవించింది. క్లైమాక్స్‌లో పాయల్ చూపించిన హావభావాలు ప్రేక్షకుడికి కొత్త అనుభూతిని కలిగిస్తాయి.

రావు రమేశ్ పవర్ ఫుల్‌గా ఆర్ ఎక్స్ 100 చిత్రంలో రావు రమేస్ మరోసారి చక్కటి పాత్రను పోషించారు. తొలి భాగంలో విశ్వనాథం పాత్రలో నెగిటివ్ షేడ్స్ కనిపించినప్పటికి.. సెకండాఫ్‌లో ఆయన పాత్రను మలిచిన తీరు, ఆ పాత్రలో రావు రమేష్ జీవించిన తీరు ఆడియెన్స్‌ను కట్టిపడేస్తుంది. ఇప్పటికే ఎన్నో వైవిధ్యమైన పాత్రలను పోషించిన ఆయనకు విశ్వనాథం ఆయన కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచే పాత్ర అని చెప్పవచ్చు. సెకండాఫ్‌లో రావు రమేష్ నటన అమోఘం అని చెప్పవచ్చు.

రాంకీ నటన తెలుగు సినిమాలకు చాలా కాలంగా దూరమైన సింధూరపువ్వు రాంకీ మరోసారి తెరపై మెరుపులు మెరిపించారు. గాడ్ ఫాదర్ లాంటి పాత్రను అవలీలగా రక్తికట్టించాడు. భావోద్వేగాల మధ్య సాగే పాత్రలో జీవించాడని చెప్పవచ్చు. రొటీన్‌కు భిన్నంగా అద్భుతమైన క్యారెక్టర్‌లో ఒదిగిపోయాడు. పోలీస్ ఆఫీసర్ పాత్రలో దయానంద్ రెడ్డి గుర్తుండిపోతారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 9440662699, Email : rajadhanivartalu1@gmail.com